సాక్షి రంగారెడ్డి

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



కీచక ప్రిన్సిపాల్ రిమాండ్

మైనర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ కీచక ప్రిన్సిపల్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 10లో▸



పెళ్లి చేసుకోమంటే..

పథకం ప్రకారం ప్రియురాలిని హత్యచేసి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 10లో▸



వేతనాలు ఇవ్వండి

ప్రభుత్వం నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోంలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

భూసేకరణ అభ్యంతరాలపై నేటి సమావేశం రద్దు

యాచారం: భూసేకరణ అభ్యంతరాలపై శనివారం రైతులతో కలెక్టరేట్‌లో జరిగే వ్యక్తిగత సమావేశం రద్దయినట్లు యాచారం తహసీల్దార్ అయ్యప్ప వెల్లడించారు. కలెక్టర్ నారాయణరెడ్డికి అత్యవసర సమావేశం ఉన్నందున నోటీసులపై జరిగే సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిందని తెలిపారు. అయితే, వందలాది మంది రైతులు ఒక్కసారిగా కలెక్టరేట్‌కు వస్తే జరగరానిది జరిగితే పెద్ద సమస్యగా మారుతుందనే కోణంలో సమావేశాన్ని రద్దు చేసినట్లు తెలిసింది. సమావేశం రద్దయినప్పటికీ నోటీసులు అందుకున్న కొందరు రైతులు అనుకున్న సమయం ప్రకారం లాయర్లతో కలిసి కలెక్టరేట్ వెళ్లనున్నట్లు సమాచారం.

నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న జాతీయ సమావేశాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ కోరారు. జాతీయ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను పట్టణ ముఖ్యకూడలిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్‌చౌహాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యార్థులపై మత తత్వ భావజాలాన్ని రుద్దడానికి కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 9న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సెమినార్‌కు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హాజరు కానున్నారని, 10న జాతీయ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శులు శివకుమార్, ఆకాష్‌నాయక్, అమీర్, కార్తీక్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



ఢిల్లీకి తరలి వెళ్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక కమిటీ జిల్లా అధ్యక్షుడు భుజంగరెడ్డి డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా దివ్యాంగులకు పెన్షన్ అందించాలని కోరుతూ శుక్రవారం 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా భుజంగరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జాతీయ పెన్షన్ దివ్యాంగులందరికీ వర్తింపజేయాలని, పెన్షన్ పొందడం దివ్యాంగుల హక్కుగా చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. రైలు ప్రయాణంలో రాయితీ సౌకర్యాన్ని పునరుద్ధరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు పొందేలా యూడీఐడీ కార్డును గుర్తింపు కార్డుగా పరిగణించాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో 5 శాతం నిధులు కేటాయించాలని, విద్యాభివృద్ధికి తమిళనాడు, మహారాష్ట్రాల తరహాలో ప్రత్యేక పాలసీ తేవాలన్నారు. ఈ నెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభలో తమ డిమాండ్లను వ్యక్తపరుస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజు పాల్గొన్నారు.

వర్సిటీల్లో పాత పద్ధతిలోనే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్

లక్డీకాపూల్: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో చేపట్టే ప్రొఫెసర్ల రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే చేపట్టాలని తెలంగాణ స్టేట్ డాక్టరేట్స్ అసోసియేషన్ (టీజీడీఏ) డిమాండ్ చేసింది. స్క్రీనింగ్ టెస్టుల పేరుతో రిక్రూట్‌మెంట్‌ను వివాదాస్పదం చేయకుండా యూజీసీ నిబంధనల మేరకు ప్రక్రియను చేపట్టాలని సూచించింది. 15 ఏళ్లుగా యూనివర్సిటీల్లో ఎలాంటి రిక్రూట్‌మెంట్లు లేక ఆందోళన చెందుతున్న నిరుద్యోగుల బాధలను గుర్తించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పాలాడి రమణరావు, అధ్యక్షుడు డాక్టర్ పి.నరేందర్ రెడ్డి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

శోభాయమానం



తలకొండపల్లి మండలం వెల్జాల సమీపంలోని శ్రీ వేదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. - ఆమనగల్లు

డప్పు కొట్టి సంబరం



కులగణన, ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో ఆమోదం పొందిన నేపథ్యంలో శుక్రవారం కొత్తూరులో సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇతర నాయకులు డప్పులు వాయిస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. - కొత్తూరు

మితి మీరి.. అర్హతకు మించి!

- ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో ఓ ఆర్ఎంపీ అబార్షన్లు, కుటుంబ నియంత్రణ చికిత్సలు చేస్తున్నట్లు ఏకంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు రెండు రోజుల క్రితం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తన బృందంతో వెళ్లి క్లినిక్‌ను సీజ్ చేశారు. హైడోస్ యాంటీ బయాటిక్స్, పెయిన్ కిల్లర్లు, ఇతర మందులు భారీగా ఉన్నట్లు గుర్తించారు.
- ఇబ్రహీంపట్నంలోని ఓ గైనకాలజిస్ట్ వద్ద పని చేసిన నర్సు ఒకరు ఏకంగా ఎంబీబీఎస్ వైద్యురాలిగా చలామణి అవుతూ ఇటీవల ఎస్ఓటీ పోలీసులకు పట్టుబడింది.
- వనస్థలిపురం కాంప్లెక్స్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో ఏకంగా డీ ఫార్మసీ పూర్తి చేసిన వాళ్లు వైద్యులుగా చలామణి అవుతున్నారు.



ఇష్టారీతిన వైద్యం

- ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి
- గుట్టుగా అబార్షన్లు, కు.ని. చికిత్సలు
- అడ్డగోలుగా యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యులు
- చూసీచూడనట్లు వదిలేస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకవైపు ఎస్ఓటీ పోలీసులు.. మరోవైపు తెలంగాణ వైద్య మండలి సభ్యులు వరుస తనిఖీలు చేస్తున్నా.. నకిలీ వైద్యులు ఏమాత్రం వెరవడం లేదు. యథేచ్ఛగా ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి అవుతూ గుట్టుగా అబార్షన్లు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేస్తున్నారు. చికిత్సల పేరుతో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎప్పటికప్పుడు ఆయా క్లినిక్‌లు, ఫార్మసీల్లో తనిఖీలు నిర్వహించాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే కానీ తనిఖీలు చేయడం లేదనే విమర్శలు ఉన్నాయి.

మారుమూల ప్రాంతాలే లక్ష్యం

జిల్లాలో నకిలీ వైద్యులు హల్‌చల్ చేస్తున్నారు. టెన్త్, ఇంటర్ ఫెయిలైన వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వార్డు బాయ్‌లుగా చేరి, ఆ తర్వాత ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులుగా అవతారం ఎత్తుతున్నారు. మరికొంత మందైతే ఏకంగా ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి అవుతున్నారు. ప్రాథమిక చికిత్సలకే పరిమితం కావాల్సిన వారు ఏకంగా అబార్షన్లు, సున్తీలు చేస్తున్నారు. పేదలు, నిరక్ష్యరాస్యులు అధికంగా నివసించే మారుమూల ప్రాంతాలు, బస్తీలను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్, నందనవనం, బీఎన్‌రెడ్డి, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, మీర్‌పేట, నాదర్‌గుల్, శంషాబాద్, జల్‌పల్లి, బాలాపూర్, షాద్‌నగర్, కొందుర్గు, ఆమనగల్లు, మాడ్గుల, మంచాల, యాచారం, తలకొండపల్లి, కేశంపేట, చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాల్లో నకిలీల బెడద ఎక్కువైంది. డయాగ్నోస్టిక్ సెంటర్లు, మెడికల్ షాపులు మాటున యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. సాధారణ జ్వరం, నొప్పులతో బాధపడుతున్న వారికి హైడోస్ యాంటీబయాటిక్, పెయిన్ కిల్లర్ ఇంజెక్షన్లు ఇస్తూ హస్తవాసి ఉన్న వైద్యులుగా చలామణి అవుతున్నారు. వీరిచ్చే హైడోస్ మందులతో తాత్కాలికంగా నొప్పి నుంచి ఉపశమనం లభించినప్పటికీ భవిష్యత్తులో కిడ్నీల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

సరైన ప్రాక్టీస్ లేకుండా..

మరికొంత మందైతే ఏకంగా డీమ్డ్ యూనివర్సిటీల నుంచి డాక్టర్ సర్టిఫికెట్లు పొందినట్లు చూపుతున్నారు. ఇటీవల కొత్తపేట అలకనంద ఆస్పత్రిలో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ సూత్రధారులు కూడా ఇదే వర్సిటీల నుంచి పట్టాలు సంపాదించినట్లు సమాచారం. ఆయుర్వేద, యునానీ, హోమియోపతి కోర్సులు పూర్తి చేసిన వారికి సరైన ప్రాక్టీస్ లేదు. దీంతో వీరు అల్లోపతి వైద్యులుగా అవతారం ఎత్తుతున్నారు. అల్లోపతి వైద్యులతో పోలిస్తే.. ఆయుర్వేద, యునానీ, హోమియో వైద్యుల వేతనాలు కూడా చాలా తక్కువ. అందుకే బస్తీల్లో వెలసిన క్లినిక్‌ల్లో మాత్రమే కాదు.. బడా కార్పొరేట్ ఆస్పత్రులు సైతం వారిని డ్యూటీ డాక్టర్లుగా నియమించుకుంటున్నారు. వీరు రాత్రి పూట మాత్రమే విధుల్లో ఉంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చిన రోగి చెప్పిన విషయాలన్నీ రాసుకుని క్రాస్ ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నారు. వీరిపై చీటింగ్ సహా డ్రగ్ అండ్ కాస్మొటిక్ యాక్ట్‌ల ప్రకారం కేసులు నమోదు చేసే అవకాశం ఉన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పట్టించుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హతకు మించి వైద్యం చేయొద్దు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్ఎంపీ, పీఎంపీలు అర్హతకు మించిన వైద్యం చేయరాదని తెలంగాణ రాష్ట్ర పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఉక్కుల అశోక్ అన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యం రాకున్నా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, మితిమీరిన వైద్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అన్ని జిల్లాలు, మండలాల్లో నకిలీ వైద్యులను గుర్తించాలన్నారు. సంఘం నాయకులు సిఫారసు చేసిన వారినే అర్హులుగా గుర్తించాలన్నారు.

ఆస్తులు అమ్మితేనే మనుగడ

నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

హయత్‌నగర్: నష్టాల్లో కూరుకుపోతున్న డెయిరీని రక్షించుకోవాలంటే ఆస్తులను అమ్మి బకాయిలు తీర్చడం తప్ప వేరే మార్గం లేదని నల్లగొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సమాఖ్య (నార్ముల్ మదర్ డెయిరీ) చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం హయత్‌నగర్ మదర్ డెయిరీ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తీర్మానం ప్రవేశ పెట్టారు. కొంతకాలంగా నష్టాలు వస్తుండడంతో అప్పుల భారం పెరుగుతూ పోతోందని, నెలకు సుమారు రూ.40 లక్షలు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే డెయిరీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. నష్టాలను తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు చేశామని, రోజుకు 50-60 వేల లీటర్ల పాల అమ్మకాన్ని 80 వేల లీటర్ల వరకు పెంచామని చెప్పారు. అయినా వడ్డీల భారం పెరుగుతుండడంతో డెయిరీని అప్పుల ఊబిలో కూరుకుపోకుండా రక్షించేందుకు ఆస్తులు అమ్మాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. డెయిరీ మనుగడ రైతుల చేతుల్లోనే ఉందని, పాలక వర్గం ప్రతిపాదనకు చైర్మన్లు సానుకూలంగా ఉండాలని కోరారు. చైర్మన్ ప్రతిపాదనను ఆమోదిస్తూ మెజారిటీ చైర్మన్లు సంతకాలు చేసినట్లు అధికారులు తెలిపారు.

చైర్మన్ల విభిన్న వాదనలు

మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకం ప్రతిపాదనపై రైతు సంఘాల చైర్మన్లు భిన్నమైన వాదనలు వినిపించారు. నష్టాలకు కారణమైన అధికారులు, గత పాలకవర్గ సభ్యులపై చర్యలు తీసుకోవాలని.. భూములను అమ్మకుండా ప్రభుత్వం నుంచి గ్రాంటు తేవాలని.. వ్యయాలను తగ్గించాలని.. సేల్స్ పెంచేందుకు అధికంగా ఉన్న ఉద్యోగులను వినియోగించాలని పలువురు సూచించారు. ఆస్తులు అమ్మితే ముందుగా రైతుల బకాయిలు చెల్లించాలని, మిగిలిన డబ్బులను వారికి బోనస్‌గా ఇవ్వాలని, అవసరమైతే మరోచోట ఆస్తులు కొనాలన్నారు. రైతులకు బకాయిలు చెల్లించిన తర్వాతే అప్పులు చెల్లిస్తామని.. ఆస్తుల అమ్మకం ఓపెన్ యాక్షన్ ద్వారా పారదర్శకంగా చేపడతామని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎండీ కృష్ణ, మాజీ చైర్మన్లు గుత్త జితేందర్ రెడ్డి, గంగుల కృష్ణారెడ్డి, శ్రీకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహా కుదుపు!

గొర్రె తోక బెత్తెడు చందంగా హెచ్ఎండీఏ ఆదాయం

- ఔటర్ వరకు జీహెచ్ఎంసీలో విలీనంతో తగ్గనున్న రాబడి
- రియల్ కుదేల్‌తో ఇప్పటికే భారీగా పడిపోయిన ఆదాయ వనరులు
- ప్రస్తుతం నెలకు రూ.100 కోట్లు రావడమూ కష్టమే



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) రెండేళ్ల క్రితం వరకు అప్పటి సర్కారు ఖజానాకు భారీగా ఆదాయాన్ని ఆర్జించిపెట్టిన సంస్థ. నగరాభివృద్ధిలో ఎంతో క్రియాశీలమైన భాగస్వామ్యం కలిగిన ప్రభుత్వ విభాగం. ఔటర్‌రింగ్‌రోడ్డు నిర్మాణం నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే సహా అనేక ఫ్లైఓవర్‌లు, భారీ ప్రాజెక్టులు, ఉప్పల్ భగాయత్ వంటి భారీ లే అవుట్‌లను అభివృద్ధి చేసి రూ.వేల కోట్ల ఆదాయాన్ని గడించింది. అలాంటి హెచ్ఎండీఏ పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణానికి కూడా డబ్బుల్లేని పరిస్థితి. వందలాది ఎకరాల భూములు ఉన్నా కొనుగోలు చేసేవారే లేకుండాపోయారు. మరోవైపు మహా నగర పరిధిని విస్తరిస్తూ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన ప్రణాళికలతో హెచ్ఎండీఏ ఆదాయం మరింత పడిపోయే పరిస్థితి. రానున్న రోజుల్లో హెచ్ఎండీఏ కార్యకలాపాల్లో పెద్ద ఎత్తున స్తబ్దత నెలకొంటుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అధికార వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

నెలకు రూ.100 కోట్ల లోపే..

గతంలో వివిధ రకాల అనుమతులు, ప్రొసీడింగ్స్, ఫీజులు తదితర రూపాల్లో ప్రణాళికా విభాగం నుంచి హెచ్ఎండీఏకు ప్రతి నెలా రూ.150 కోట్లు పైనే ఆదాయం లభించేది. ప్రస్తుతం రూ. వంద కోట్లు కూడా లభించడం లేదు. వివిధ రూపాల్లో వచ్చే ఆదాయం కేవలం అధికారులు, ఉద్యోగుల జీత భత్యాలు, సంస్థ కార్యకలాపాల నిర్వహణ, రవాణా తదితర అవసరాలకే ఖర్చవుతోంది. ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా అప్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడాది కాలంగా రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్దత కారణంగా భారీ వెంచర్లు, లే అవుట్‌లు తగ్గుముఖం పట్టాయి. హైరైజ్ భవనాల నిర్మాణాలు కూడా తగ్గాయి. మరోవైపు అనుమతుల్లో జాప్యంతోనూ నిర్మాణ సంస్థలు వెనుకంజ వేస్తున్నాయి.

ట్రిపుల్ ఆర్ వరకు విస్తరించినా..

ప్రస్తుతం హెచ్ఎండీఏ సుమారు 7,257 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. 7 జిల్లాలు.. 70 మండలాలు, 1032 గ్రామాలు హెచ్ఎండీఏ దీని పరిధిలో ఉన్నాయి. 40 మున్సిపాలిటీల్లో హెచ్ఎండీఏ అనుమతులిస్తోంది. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తోంది. ఇందులో భాగంగా అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా విభజించనున్నారు. ఈ మేరకు ఓఆర్ఆర్ వరకు ఉన్న మున్సిపాలిటీలు, నగర పంచాయతీలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. దీంతో ఔటర్ వరకు అనుమతులు ఇచ్చేందుకు జీహెచ్ఎంసీకి అవకాశం లభిస్తుంది. సాంకేతికంగా హెచ్ఎండీఏ పరిధి ట్రిపుల్ వరకు విస్తరిస్తుంది. అంటే 14,000 చదరపు కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉంది. కానీ.. ఔటర్ లోపల జరిగే నిర్మాణాలు, అభివృద్ధి కార్యకలాపాలపై పెద్ద ఎత్తున ఆదాయం లభిస్తుందని, భవిష్యత్ అవసరాల కోసం ట్రిపుల్ ఆర్ వరకు సెమి అర్బన్ పరిధిని పెంచినా నిర్మాణరంగం అభివృద్ధికి చాలా ఏళ్లు పట్టవచ్చని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో ఔటర్ వరకు జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల ఆ సంస్థ ఆదాయం పెరిగి, హెచ్ఎండీఏ రాబడి గణనీయంగా తగ్గనుంది.

అప్పట్లో కల్పవృక్షం..

గత సర్కార్ హయాంలో హెచ్ఎండీఏ కాసులు కురిపించే కల్పవృక్షంగా ఉండేది. వందల ఎకరాల భూములను ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో విక్రయించి రూ.వేల కోట్లు ఆర్జించింది. కోకాపేట్ నియోపోలిస్ భూములపై దాదాపు రూ.3319 కోట్లు లభించగా, బుద్వేల్‌లో వంద ఎకరాలు విక్రయాలతో మరో రూ.3,625.73 కోట్లు వచ్చాయి. ఔటర్ రింగ్ రోడ్డును లీజుకు ఇవ్వడం ద్వారా రూ.7,380 కోట్లు సమకూరాయి. ప్రస్తుతం భూములు విక్రయించే అవకాశం లేక.. ఆదాయ మార్గాలు లేక హెచ్ఎండీఏ కుదేలవుతోంది. భవిష్యత్ మరింత ప్రశ్నార్థకంగా మారొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



పోర్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఆన్‌లైన్‌లో యూఎల్సీ కేసుల సమాచారం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం (యూఎల్సీ) కోర్టు కేసుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో E Court-ULCRR పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రంగారెడ్డి పట్టణ భూ పరిమితి చట్టానికి సంబంధించి అన్ని కోర్టు వివాదాల వివరాలను ఇందులో పొందుపరిచినట్లు తెలిపారు. కోర్టు వివాదాలకు చెందిన సమగ్ర సమాచారం, కేసు వారీగా కక్షిదారుల సమాచారం, సర్వే నంబర్, గ్రామం, పూర్వాపరాలు, ప్రస్తుత స్థితి, వాయిదాల సమాచారం ఇలా పూర్తిగా అందుబాటులో ఉండనుందని ప్రకటించారు. కేసుల పర్యవేక్షణ, కింది స్థాయి అధికారులకు తక్షణ ఆదేశాల జారీకి వీలుంటుందని చెప్పారు. ఎలాంటి జాప్యానికి, నిర్లక్ష్యానికి తావు లేకుండా అర్బన్ ల్యాండ్ సీలింగ్ కేసుల విషయంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండడానికి సహాయపడుతుందని తెలిపారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి సందర్శన చేశారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.

కబ్జాలు సహించేది లేదు



మంఖాల్‌లో కొత్తకుంటను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు

తుక్కుగూడ: చెరువులు, కుంటలు, నీటి కాల్వలను కబ్జా చేస్తే సహించేంది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సూరం చెరువు, కొత్తకుంట, పావని కుంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కుంటలు, చెరువు కబ్జాకు గురవుతున్నట్లు స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో వీటిని పరిశీలించడానికి వచ్చినట్లు చెప్పారు. సూరం చెరువు 60 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సి ఉండగా ప్రస్తుతం సుమారు 38 ఎకరాల వరకు ఉందన్నారు. కబ్జా చేసింది ఎంతటి వారైనా వదిలిపెట్టేది లేదన్నారు. చెరువులు, కుంట లను కాపాడటానికి రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ దుద్యానాయక్, ఏఈలు గోవింద్, నాగరాజు, హైడ్రా సీఐ తిరుమలేష్, ఆర్ఐ స్వర్ణకుమారి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మాదిగలకు 11 రిజర్వేషన్ కల్పించాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్


దప్పులతో ఎమ్మార్పీఎస్ నేతల ర్యాలీ

శంకర్‌పల్లి: ఎస్సీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయబద్ధంగా వ్యవహరించి, మాదిగలకు 11శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేల గొంతులు–లక్ష డప్పుల కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై ముప్పై ఏళ్లుగా పోరాడుతున్న మందకృష్ణ మాదిగ పేరును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం మాలల ఒత్తిడికి తలొగ్గకుండా 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాస్, నర్సింహ, ప్రశాంత్, శేఖర్, సంపత్, సాయి గణేశ్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ ఫైనల్ మ్యాచ్

మూడోస్థానంలో జిల్లా జట్టు

ఆదిలాబాద్: 71వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జట్టు విజేతగా నిలిచింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో ఈ నెల 4న కబడ్డీ పోటీలు ప్రారంభం కాగా శుక్రవారం ముగిసాయి. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో రాష్ట్రంలోని 34 జిల్లాలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సింథటిక్ మ్యాట్లపై నాలుగు రోజుల పాటు డే నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సూర్యాపేట జట్టు నల్గొండ జట్టుపై 39–33 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. గత ఏడాది సైతం ఈ టోర్నీలో ఈ రెండు జట్లే తలపడగా.. నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. ఈసారి చరిత్రను తిరగరాస్తూ సూర్యాపేట చాంపియన్ షిప్ కైవసం చేసుకుంది. నల్గొండ జట్టు రెండో స్థానంలో నిలువగా.. వనపర్తి, రంగారెడ్డి జట్లు సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాయి. ఇంటర్నేషనల్ కబడ్డీ ఫెడరేషన్ డైరెక్టర్ జగదీశ్వర్ యాదవ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ కబడ్డీ టీం మాజీ కోచ్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి రవికుమార్, రాష్ట్ర సంఘం జాయింట్ సెక్రెటరీ గట్టయ్య యాదవ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 4,901 దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4,901 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 157, విద్యుత్ శాఖ 105, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 30, ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,865 దరఖాస్తులు వచ్చాయి. పౌర సరఫరాల శాఖకు సంబంధించి 1640 (రేషన్ కార్డులు) దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 109 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు

యాచారం: వాహనాలు నడిపే విషయంలో డ్రైవర్లు నింబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలోని కుర్మిద్ద–మీరాఖాన్‌పేట మార్గంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడిపే వ్యక్తులకు లైసెన్స్‌లు, ఆర్‌సీలు.. కార్లల్లో ఏం తరలిస్తున్నారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని తరలిస్తున్నారా అనే కోణంలో తనిఖీలు చేపట్టారు. రోడ్లపై తిరిగే విద్యార్థులు, యువతను సైతం వ్యక్తిగతంగా తనిఖీ చేపట్టి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం కుర్మిద్ద గ్రామంలో ప్రజలతో సమావేశమై కొత్త వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

తాగుడుకు బానిసైన వ్యక్తి బలవన్మరణం

కేశంపేట: కుటుంబ తగాదాల కారణంగా మద్యానికి బానిసైన వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ నరహరి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శివారెడ్డి(40) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్న ఆయన శుక్రవారం భార్యతో తగువుపడి బయటకు వెళ్లాడు. తన పొలం వద్ద ఉన్న షెడ్‌లో పైపునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లగా అప్పడికే మృతి చెందాడు. మృతుడి భార్య నీలవేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెళ్లి చేసుకోమంటే.. ప్రాణం తీశాడు

- ప్రియురాలిని హత్య చేసి పరారైన ప్రియుడు
- నాలుగు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడు
- ఆధార్ కార్డు ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుడికి రిమాండ్
- వివరాలు వెల్లడించిన పట్టణ సీఐ విజయ్‌కుమార్


వివరాలను వెల్లడిస్తున్న పట్టణ సీఐ విజయ్‌కుమార్


జ్యోతిసింగ్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఒకే పరిశ్రమలో పని చేస్తున్న ఇద్దరి పరిచయం ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారితీసింది. తరచూ వేరే వ్యక్తులతో ఫోన్ మాట్లాడుతున్న ప్రియురాలు పెళ్లి విషయం తీసుకురావడంతో ఆమెను అడ్డుతొలగించుకునేందుకు ప్రియుడు హత్య చేసి పరారయ్యాడు. కొన్ని నెలలుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సాంకేతిక ఆధారాలతో పట్టుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను శుక్రవారం పట్టణ సీఐ విజయ్‌కుమార్ విలేకరులకు వెల్లడించారు.

పనిచేసే చోట పరిచయం

మధ్యప్రదేశ్ రాష్ట్రం, అనుప్పూర్ జిల్లా నింహో గ్రామానికి చెందిన సంజయ్‌చంద్ర అలియాస్ సంజయ్ మహార కొంత కాలంగా దూసకల్ సమీపంలోని ఓ చాక్లెట్ పరిశ్రమలో పని చేస్తూ మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. అదే పరిశ్రమలో పని చేస్తున్న అనుప్పూర్ జిల్లా జేతరి గ్రామానికి చెందిన జ్యోతిసింగ్(24)తో పరిచయం ఏర్పడింది. వారి పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. వీరు ఇరువురూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. జ్యోతిసింగ్ తన స్నేహితురాలు గీతతో కలిసి చటాన్‌పల్లి సమీపంలో అద్దెకు ఉండేది.

పెళ్లి చేసుకోకుంటే పరువుతీస్తా

సంజయ్‌చంద్ర, జ్యోతిసింగ్ ఏకాంతంగా ఉన్న సమయంలో జ్యోతిసింగ్‌కు వేరే వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చేవి. వారితో ప్రత్యేకంగా ఫోన్ మాట్లాడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కొంత కాలంగా సంజయ్‌చంద్ర ఆమెను దూరం పెడుతూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలో వివాహ విషయం ఏమైందని జ్యోతిసింగ్ సంజయ్‌చంద్రను ప్రశ్నించడంతో నువ్వు వేరే వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడుతున్నావు చేసుకోనని సమాధానం ఇచ్చాడు. దీంతో పెళ్లి చేసుకోకపోతే నీపై కేసు పెడతానని, మీ ఇంటికి వెళ్లి మన విషయం చెప్పి పరువు తీస్తానని సంజయ్‌ని బెదిరించింది. దీంతో సంజయ్‌చంద్ర ఆమె అడ్డు తొలగించుకోవాలని హత్యకు పథకం వేసుకున్నాడు.

హత్యచేసి.. పరారీ

వివాహ విషయం మాట్లాడదామని సంజయ్‌చంద్ర 2024 నవంబర్ 28న జ్యోతిసింగ్‌కు ఫోన్‌చేశాడు. దీంతో ఆమె ప్రియుడు చెప్పినట్లు చటాన్‌పల్లి శివారులోని న్యాట్కో పరిశ్రమకు వెళ్లే రోడ్డు వద్దకు వచ్చింది. అక్కడ నుంచి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకు వెళ్లిన తరువాత ఇద్దరి మధ్య గొడవ జరిగింది. సంజయ్‌చంద్ర ముందస్తు పథకం ప్రకారం.. జ్యోతిసింగ్‌ను వరిపొలంలోని బురదలో పడేసి మెడపై కాలుపెట్టి ఊపిరాడకుండా చేసి హత్యచేశాడు. ఆమె మృతదేహాన్ని పూడ్చేసి అక్కడ నుంచి పరారయ్యాడు.

సోదరుడి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు

మృతురాలు జ్యోతిసింగ్ కొన్ని రోజులు కనిపించడంలేదు, ఫోన్ కలవడంలేదని మృతురాలి సోదరుడు రాకేష్‌కుమార్ 2024 డిసెంబర్ 5న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తుండగా.. నాలుగు రోజుల తరువాత గుర్తు తెలియని మహిళ శవం బయట పడింది. దీంతో మృతదేహాన్ని చూసిన రాకేష్‌కుమార్ తన చెల్లెలు జ్యోతిసింగ్‌గా గుర్తించాడు.

ఆధార్ ఆధారంగా

మహిళ హత్య కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతురాలి ప్రియుడు ఇక్కడ లేకపోవడంతో పోలీసులు సంజయ్‌చంద్రపై అనుమానంతో దర్యాప్తును చేపట్టారు. మృతుడి ఇంటికి వెళ్లినా నిందితుడు దొరకలేదు. నిందితుడు సిమ్ కార్డులను మార్చుతూ మహారాష్ట్రలో తలదాచుకున్నట్లు గుర్తించిన పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆధార్‌కార్డు ఆధారంగా సంజయ్‌చంద్ర మార్చిన సిమ్ నంబర్‌ను గుర్తించారు. అదే సిమ్‌కార్డు నుంచి సంజయ్‌చంద్ర తన తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో సంజయ్‌చంద్రను మహారాష్ట్రలోని గడ్చిరోలి అటవీప్రాంతంలో తలదాచుకున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు తమదైన శైలిలో విచారించగా సంజయ్‌చంద్ర నేరాన్ని ఒప్పుకొన్నాడు. జ్యోతిసింగ్‌ని హత్య చేసిన ప్రదేశానికి నిందితుడిని తీసుకొని వెళ్లిన పోలీసులు పూర్తి వివరాలను సేకరించారు. అనంతరం సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

పోలీసులకు రివార్డులు: సీఐ

మహిళ హత్య కేసును నమోదు చేసిన పోలీసులు కేసును ఛేదించారు. సీపీ అవినాష్‌మహంతి పర్యవేక్షణలో శంషాబాద్ డీసీపీ రాజేష్, అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంతో విచారణ అధికారి పట్టణ సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐలు సుశీల, శరత్‌కుమార్, సిబ్బంది కేసును ఛేదించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్‌ఐలు సుశీల, శరత్‌కుమార్, సిబ్బంది నరేందర్, కరుణాకర్, మహేష్, రఫీలకు పోలీసు ఉన్నతాధికారులతో రివార్డులను ఇప్పిస్తామని పట్టణ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కార్ల వ్యాపారమంటూ కాజేశారు!

- నగర వాసికి వాట్సాప్ ద్వారా ఎర
- ఖర్చులు, అడ్వాన్స్ పేరుతో టోకరా
- రూ.37.9 లక్షలు స్వాహా, కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ వ్యాపారికి వాట్సాప్ ద్వారా పరిచయమైన సైబర్ నేరగాళ్లు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారమంటూ ఎర వేశారు. నమ్మకం కలిగించడానికి కొన్ని పత్రాలను పంపించారు. దీంతో తానూ ఆ బిజినెస్‌లోకి వస్తానని బాధితుడు చెప్పడంతో అసలు కథ మొదలెట్టారు. అడ్వాన్సు, కార్ల రవాణా ఖర్చుల పేరుతో దఫదఫాలుగా రూ.37.95 లక్షలు కాజేశారు. నగరంలో నివసిస్తున్న ఓ వ్యాపారికి గత ఏడాది వాట్సాప్ నుంచి ఓ సందేశం వచ్చింది. తాము సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారం చేస్తుంటామని, ఆసక్తి ఉంటే మీరూ ఈ దందాలోకి దిగవచ్చని దాని సారాంశం. ఆపై వేర్వేరు వాట్సాప్ నెంబర్ల నుంచి, దఫదఫాలుగా మాట్లాడిన నలుగురు తాము ఇన్నోవా, క్రిస్టాలతో పాటు ఐచర్లు, జేసీబీలు కూడా విక్రయిస్తుంటామని నమ్మబలికారు. తమకు చోళమండలం ఇన్వెస్టిమెంట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీతో ఒప్పందం ఉందని చెప్తూ..నకిలీ పత్రాలు తయారు చేసి పంపారు. ఫైనాన్స్‌పై ఆయా వాహనాలు ఖరీదు చేసి, సరైన సమయానికి కిస్తీలు చెల్లించకపోతే వాటిని ఆ కంపెనీ జప్తు చేస్తుందని, అలాంటి వాహనాలు అతి తక్కువ ధరకే తాము ఖరీదు చేస్తామని నమ్మించారు. దీంతో నగర వ్యాపారి సైతం వారితో కలిసి సెకండ్‌హ్యాండ్ కార్ల వ్యాపారం చేయాలని, వీటిని వారి నుంచి ఖరీదు చేసి ఇక్కడ విక్రయించాలని భావించారు. ఇదే విషయాన్ని సైబర్ నేరగాళ్లకు చెప్పగా.. అవసరమైన కార్లు తామే సరఫరా చేస్తామని నమ్మబలికారు. వీటి కోసం కొంత అడ్వాన్స్, రవాణా ఖర్చులు చెల్లిస్తే చాలని, మిగిలిన మొత్తం కారు విక్రయించిన తర్వాత ఇవ్వొచ్చని చెప్పారు. దీంతో బాధితుడు తన వద్ద ఉన్న సొమ్ముతో పాటు తన రెగ్యులర్ కస్టమర్స్ దగ్గర అప్పు చేసి, స్నేహితుల వద్ద తీసుకుని పలు విడతల్లో రూ.37.95 లక్షలు వారికి బదిలీ చేశారు. ఎట్టకేలకు మోసపోయానని గుర్తించి శుక్రవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా పరిచయమై, ఇలా వాహనాలు విక్రయిస్తామంటే గుడ్డిగా నమ్మకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి వ్యాపారం కేంద్రం ఎక్కడ ఉంది? గోదాములు ఉన్నాయా? తదితరాలు సరిచూసుకోవాలని చెప్తున్నారు. స్వయంగా వెళ్లి నిర్ధారించుకోకుండా నగదు చెల్లించవద్దని స్పష్టం చేస్తున్నారు.

రాజాసింగ్‌పై కేసులో మీ వివరణేంటి?

ఫిర్యాదుదారుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో 2021లో నమోదైన కేసుపై వివరణ ఇవ్వాలని ఫిర్యాదుదారు ఎస్.తాజంరెడ్డిని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. పోలీసులను కూడా కౌంటర్ దాఖలు చేయమని ఆదేశిస్తూ..తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదా వేసింది. జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట 2021, జూన్‌లో ధర్నా నిర్వహించినప్పుడు సైఫాబాద్ పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ మరో 20 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ..నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని, డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయాలని బీజేపీ నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తుండగా కార్యాలయంలోకి జొరబడ్డారని తప్పుడు కేసు నమోదు చేశారన్నారన్నారు. కోవిడ్ నిబంధనలను ఉల్లంఘించారని సైఫాబాద్ ఎస్‌ఐ ఎం.తాజంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారని..తప్పుడు కేసు కొట్టేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి..ఫిర్యాదుదారు తాజంరెడ్డికి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేశారు.

కారులో తరలిస్తున్న 14 కిలోల గంజాయి పట్టివేత

- లేడీ డాన్‌తో పాటు మరో ఇద్దరి అరెస్ట్
- రూ.8.50 లక్షల విలువైన గంజాయి, కారు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి అక్రమ రవాణ కొత్త పుంతలు తొక్కుతోంది. నిఘా వ్యవస్థకు చిక్కకుండా గంజాయి రవాణా చేస్తున్న ముఠా గుట్టును ఎక్సైజ్ పోలీస్ బృందం రట్టు చేసింది. వివిధ మార్గాల్లో గంజాయి తరలించే అక్రమార్కులు ఈ సారి సరికొత్త ఎత్తుగడను అనుసరించారు. కుటుంబ సభ్యులతో కలిసి కారులో ప్రయాణం చేస్తున్నట్లుగా ఎలాంటి అనుమానాలు రాకుండా కారు వెనుక సీటు కింది భాగంలో ప్రత్యేక అరలు చేసి అందులో 14 కిలోల గంజాయి ప్యాకెట్లును అమర్చారు. ఒడిశాలోని మల్కన్‌గిరి, జగ్దల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సీఐ నాగరాజు టీమ్ హయత్‌నగర్‌లో పట్టుకున్నారు. అక్రమంగా రవాణాకు పాల్పడిన లేడీ డాన్ సునీతా దాస్ ధూల్‌పేట్‌లోని ఒక వ్యాపారికి విక్రయించేందుకు గంజాయిని తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో లేడీడాన్ సునీతా దాస్‌తోపాటు కారు డ్రైవర్ ఇస్తియాఖురేషి, కంకన్ సన అనే వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయి రవాణాకు వినియోగించిన కారు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.3.50 లక్షలు, కారు ఖరీదు మరో రూ.5 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.

200 కిలోల గంజాయి పట్టివేత

చాంద్రాయణగుట్ట: గంజాయి రవాణ చేస్తున్న ఓ అంతరాష్ట్ర పెడ్లర్‌ను చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ.50 లక్షల విలువైన 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సౌత్ ఈస్ట్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ కేసు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా మేఘ్యానాయక్ తండాకు చెందిన డ్రైవర్ జాదవ్ శివరాం, తన స్నేహితుడైన బానావత్ జైపాల్‌తో కలిసి 2015 నుంచి వైజాగ్‌లోని సీలేరుతో పాటు ఒడిశా నుంచి మహారాష్ట్రలోని వినియోగదారులకు గంజాయి రవాణా చేస్తున్నాడు. తక్కువ ధరకు కొనుగోలు చేసి అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తూ విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం ఒడిశాకు చెందిన సుభాష్ అనే వ్యక్తి వద్ద కిలో రూ.4 వేల చొప్పున 200 కిలోల గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయించేందుకు కారులో తీసుకొస్తున్నాడు. జైపాల్‌తో కలిసి కిలో రూ.8 వేలకు ఎల్‌బీ నగర్‌లో వినియోగదారులకు విక్రయించాలని పథకం రచించాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు వలపన్ని చాంద్రాయణగుట్టలో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 200 కిలోల గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడు గతంలోనూ ఎన్‌డీపీఎస్ కేసులలో నిందితుడిగా ఉన్నాడు.

చిల్డ్రన్స్ హోం సిబ్బందికి వేతనాలు ఇవ్వండి

బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చిల్డ్రన్స్ హోం సిబ్బందితో బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోంలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రతాప్ మాట్లాడుతూ.. మొయినాబాద్‌కు చెందిన ప్రభుత్వ చిల్డ్రన్స్ హోం తుర్కయంజాల్‌లో నిర్వహిస్తున్నారని ఇక్కడ పనిచేస్తున్న ఏడుగురి సిబ్బందికి తొమ్మిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అధికారుల వేధింపులు తట్టుకోలేక పోతున్నారని ఆరోపించారు. వేతనాల విషయమై సూపరింటెండెంట్, మెట్రిన్‌లను అడిగితే 20 మంది పిల్లలను సిబ్బందికి తెలియకుండా వేరే చోటుకు తరలించి తాళాలు వేసి హోం తీసేశామని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశఋరు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో నర్సింహగౌడ్, అంజయ్య, యాదయ్య, నర్సింహ, శంకర్ ఉన్నారు.

బాలికతో స్కూల్ బస్సు డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

- పాఠశాల వద్ద బాధితులు, విద్యార్థి సంఘాల ఆందోళన
- డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు


పాఠశాల ముందు ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

శంషాబాద్: ఒకటో తరగతి చదివే ఆరేళ్ల చిన్నారితో పాఠశాల బస్సు డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విషయం తెలిసిన తల్లిదండ్రులతో పాటు విద్యార్థి సంఘాలు పాఠశాల ముందు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ సంఘటన శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసస్ పాఠశాల యాజమాన్యం ఈ నెల 4వ తేదీన విద్యార్థులను విహార యాత్రలో భాగంగా ఓ రిసార్ట్స్‌కు తీసుకెళ్లారు. మూత్ర విసర్జన కోసం బాలికను పక్కకు తీసుకెళ్లాలని ఓ టీచర్ చెప్పడంతో బస్సు డ్రైవర్ ఆ బాలికను పక్కకు తీసుకెళ్లాడు. మూత్ర విసర్జన అనంతరం బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. శుక్రవారం బాలిక తనకు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం తల్లిదండ్రులు వారి బంధువులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనచేశారు. డ్రైవర్లను వరసగా నిల్చోబెట్టి ఎవరు చేశారని పోలీసులు అడగడంతో జోసఫ్‌రెడ్డి డ్రైవర్‌ను చూపించడంతో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాఠశాల వద్ద ఏబీవీపీ, ఎస్‌ఎఫ్ఐ నాయకులతో పాటు మున్సిపల్ మాజీ చైర్మన్ బండిగోపాల్ యాదవ్‌లు ఆందోళన చేపట్టగా పోలీసులు వారిని సముదాయించారు. సంఘటన మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగడంతో కేసును అక్కడికి బదలాయించారు.

కీచక ప్రిన్సిపాల్ రిమాండ్


లయోలా పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

విద్యార్థి సంఘాల నేతల ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితి


ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: మైనర్ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డా కీచక ప్రిన్సిపల్‌ను శుక్రవారం ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లయోలా ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినితో ప్రిన్సిపల్ దినావస్‌రావు అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు గురిచేసిన సంగతి తెలిసిందే. ఆ విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దినావస్‌రావుపై పోక్సో చట్టంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పాఠశాల ఎదుట బైఠాయింపు

విద్యా బుద్ధులు నేర్పించే గురువే లైంగిక వేధింపులకు పాల్పడటం సహించరానిదని ఏబీవీపీ, ఎస్‌ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. లయోలా పాఠశాల అనుమతిని రద్దు చేసి నిందితుడిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని ఆందోళనకు దిగారు. పాఠశాల గేటు ఎదుట బైఠాయించారు. పలువురు ఆందోళనకారులు పాఠశాల గేటు దూకి లోనికి వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ దశలో పోలీసులకు, విద్యార్థి సంఘాల నేతల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటికే విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు వదిలిపెట్టారు. ఈ ఆందోళనలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు శంకర్, చరణ్, శ్రీకాంత్, విప్లవ్, వంశీ, తరంగ్, లక్ష్మణ్, ఏబీవీపీ నాయకులు వంశీకృష్ణ,జగదీశ్, మహేందర్, నవదీప్‌తోపాటు పాల్గొన్నారు.